# పల్లెబాటలో మల్లెమనసు

వేడి చాయ వెంకటయ్య నరాలను సరిగమలు పలికిస్తోంది. కుర్చీ వెనక్కి వాలగానే కోరవయసులోని దోరచూపులు నెమరుకొస్తున్నాయి.

"ఆ రోజుల్లో ఈ ఊరికి పిల్లనిచ్చేందు కెవ్వరూ ఇష్టపడేవారు కాదుగదా" చిలిపి చూపులతో ఎదురుగా కూచున్న అర్ధాంగి ముఖకవలికల్ని చదివేస్తున్నాడు. ఆనాటి పెళ్ళి చూపులు కళ్లల్లో రంగుల చిత్రాల్లా కదుల్తూంటే అన్నపూర్ణ బుగ్గల మీద సిగ్గులు మొగ్గలేసినై.

"మీకేదో సర్కారు నౌకరుంది. ఈ ఊళ్లో ఉండరనీ పట్నాలల్ల తిరుగుతరని మానాన్న ముందుకొచ్చిండు. లేకపోతే తమరు బెండకాయలెక్క ముదిరి...." నవ్వావుకుంది. భర్తను క్రీగంట చూస్తూ కొంగు సవరించుకుంది. పదహారేళ్ల పరువములో బోలెడన్ని కోర్కెలు బొడ్లో దొపుకుని తానా ఇంటికోడలైన దృశ్యం ఎదతెరమీద రంగుల సినిమాలా కదిలింది. మెగా టీవి సీరియల్ ముగింపు ఎపిసోడ్ చూస్తున్నట్టు తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

కాల ప్రవాహంలో కొట్టుకుపోతూ, ఆఫీసర్‌గా అన్ని జిల్లాలు తిరిగి హైదరాబాదు. లో రిటైరవగానే వెంకటయ్య మనసు మైదానములో, సొంతూరు.... సీతారంపల్లి, అందాలు బాపు సినిమాలో ప్రకృతి దృశ్యాల్లా కదలాడాయి. కల్లాకపటాల్లేని పల్లెలో శేషజీవితం ప్రశాంతంగా గడపాలని సిటీ వదిలి సీతారంపల్లి చేరుకున్నాడు. సొంతిల్లు కన్నతల్లి ఒడిలా గన్పించింది. భార్య, కూతురుతో కలిసి ఇంటి దుమ్ము దులి పిసున్నం వేయించుకున్నాడు. తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అన్నపూర్ణ సిగను చుట్టుకున్న సిరిమల్లెదండ సువాసనలు వెదజల్లుతోంది. మనసులో మలయమారుతం వీచింది.

"అప్పుడు ఊర్లెకు రోడ్డేలేదాయె. కరంటు సంగతే తెల్వదాయె. సీతారాం పల్లె కెల్లాలంటే సీతమ్మ కష్టాలనుభవించుడనే వాళ్ళు మీ అన్నయ్యలు." చూపుల్లోని చిలిపి దనం కొంటెతనం రంగరించుకుంది. ముందుకు వంగి చెంపలందుకోబోయాడు.

"అబ్బ....చాల్లే సంబడం...." బిడియం ముంచుకొచ్చింది. ముందుకు రాబోతున్న చేతులనక్కడే ఆపేస్తూంటే "ఎవరన్నా చూస్తారన్న ఇది గూడా లేదా?" చెంపలు కెంపులైపోయినై.

"ఇక్కడెవరున్నారోయ్!" దృష్టి గుమ్మం వైపు మళ్లింది. ఇంటి ముందున్న వేప చెట్టు కొమ్మలు, ఏం పరవాలేదులే అన్నట్టుగా కదుల్తున్నై. "కొడుకు హైద్రాబాదులుండె. కూతురు గుడికెళ్లింది గదా!" ప్రయత్నం విరమించలేదు.

"ఐతే మాత్రం... ఛీ... సిగ్గు లేదా?" కుర్చీకి దూరమైంది. "అమ్మా!" పీజి పాసైన మానస పసిపిల్లలా పరుగెత్తుకొచ్చింది" గుడిచాలా బాగుంది. కానీ... చెరువుల నీటి చుక్కలేదు గదా" తల్లిపక్కన నుంచుంది. నిండుగా..... కుందన బ్బొమ్మలాగుంది. ఓణీ నడముకు చుట్టుకుని కొంగుబొడ్లో దొపుకుంది. వయసు పొంగులు పరువాలను దాచలేమంటు న్నాయి. కన్నవారికి కూతురు కొత్తగా కనబడింది.

"అబ్బో! మా కూతురు ఊరంతా సర్వే చేసినట్టుంది." అన్నపూర్ణ ఆశ్చర్యం

"మరేమనుకున్నావోయ్!" కుడిచెయ్యి పేడుమూతి మీది కెళ్లింది" "అది నా కూతురు అవులిస్తే పేగులు లెక్కపెడ్తుంది" కూతురు నాపాదమస్తకం పరిశీలిస్తూ "అప్పుడే ఊరంతా తిరగావా తల్లీ?" అడిగాడు.

"చిన్న ఊరేగద నాన్నా! పక్కింటి ఊర్మిళ చూపించింది" తండ్రి పక్కన పసిపాపలా కూలబడింది "మీ ఊరి గురించి మా గొప్పగా చెప్తివిగదా నాన్నా!"

నిండా నీటితో గర్భిణిలాగున్న చెరువు, అలల ఉయ్యాలలూగుతున్న సూర్య కిరణాలు, కట్టమీద చిర్రగోనె ఆట... బాల్యం వెంకటయ్య కళ్లల్లో.. కంప్యూటర్‌తెరమీద రంగుల చిత్రాల్ల కదిలాయి.

"సంకాంత్రి పండుగొస్తుంది" కర్తవ్యం గుర్తుకొచ్చింది, ఇంటి ఇల్లాలికి. "సకినాలు, చేగోడీలు, గారెలుచెయ్యాలెగదా! ముందు పచ్చిమిరపకాయలు తెస్తే పని షురువైతుంది." పెద్దల ఆస్తిగా రెండెకరాల పొలముంది దాన్ని అమ్ముకోరాదనే పట్టుదల భూమిని నమ్ముకుని బోరు వేయించింది. కరెంటు మోటారుగ్గూడా చాలానే ఖర్చైంది. సాగుచేసిన వారి చెమట ఖరీదుగా పండిన పంటలో సగమిస్తూ వచ్చాడు. తన వంతు సగం పంట అమ్మేసి డబ్బులు తీసుకెల్తున్నాడు. ఏటేటా ముదురుతున్న ఎండలు, మొరాయించిన వానలు... బోర్లు గూడా బోర్లాపడుతున్నై. భూగర్భజలాలు పాతాళం దారిపట్టిన కారణంగా ఈసారి అతని బోరుగూడా మొరాయించింది. పంట చేతికొచ్చేసరికి చావుదప్పికన్ను లొట్టు పోయినంత పనైంది. ముంచుకొస్తున్న రిటైర్మెంటును దృష్టిలో పెట్టుకుని ఈసారి తన భాగాన్ని బస్తాల్లో నింపి ఇంట్లో పడేశాడు. సంక్రాంతి పండగతో పీడదినాలు వెళ్ళిపోతై. ఆ తర్వాత కరీంనగర్ వారు పెల్లి చూపులకొస్తారు. మానస వాళ్లకు నచ్చితే... పెళ్లి ముహూర్తాలు పెట్టించాలి. ఆకాశమంత పందిరి....అన్నట్టుగా.. ఒక్కగానొక్క కూతురుపెళ్లి సొంతిట్లో చెయ్యాలి... ఆలోచనా లోచనాలు భవిష్యత్తులోకి తొంగి చూస్తోంటే అడుగులు పొలం గట్టుమీద పడుతున్నై.

"అరే... వెంకటీ! బాగున్నవా?" బాల్య మిత్రుడు బాలయ్య పిలుపు... మేలు కొలుపులా వినబడింది. ఒళ్లు పులకరించింది.

"ఓఫ్.... బాలయ్య!" ఒకరి ఒడిలో ఒకరు బందీలయారు.

"హబ్బా! ఎన్నాళ్లకు కల్సుకున్నంరా... రా... కూచో!" తాటాకుల మంచెకిందికి తీసుకెళ్లాడు బాలయ్య. నేలమీద గొంగడి పరిచుంది. చిన్ననాటి ఆటలు, పాటలు... కబుర్లలో దొర్లిపోతున్నాయి. మంచెకు అటుపక్క పడుచుపిల్ల పరువంలా మిరపతోట నవనవ లాడ్తోంది. ఇటుపక్క అరటితోటలో టమాటా చేను. కన్నుల పండుగగా ఉంది.

పల్లెటూళ్లో ఏ తోట కెళ్లినా ఆప్యాయంగా కూరగాయలందించడం ఆనవాయితీ. డబ్బు పెట్టి కొనాల్సిన ఆగతయ్యముండదు... అలనాటి అనుభవాలు వెంకటయ్య బుర్రలో బురడీలు కొడుతున్నై. ఇప్పుడిహ మిరపకాయలు దొరికినట్టే....

ఓ పట్నం మనిషి తోట మధ్య లోంచి వారి ముందుకొచ్చాడు. సిల్క్‌లాల్చీ జేబు లోంచి పర్సు తీశాడు. "సరే బాలయ్యా! పచ్చిమిరపకాయలు, టమాటలు అన్నీతెంపించి రేపేలారీలో తీసుకెల్లా. ఇదో అడ్వాన్స్ మిగతాది లారీ లోడుకాంగనే....'

బాలయ్య కరెన్సీ నీట్లందుకున్నాడు. అతణ్ణి సిద్ధిపేట వ్యాపారిగా పరిచయంచే స్తూ "నా తోటలు గుత్తకు తీసుకున్నడు. ఇప్పడీ తోటలున్న కూరగాలన్నీ అతనివే!!" చెప్పేశాడు. వ్యాపారి కరచాలనం చేశాడు.

"ఏదోసార్! ఇట్లా తోటలు గుత్తకు తీసుకుని కూరగాయలు లారీకెక్కించి నేరుగా హైద్రాబాద్ విమానాశ్రయం పంపిస్తా. అక్కణ్నుంచి అవి గల్ఫ్ దేశాలకు పోతై. ఇక్కడి కూరగాయలక్కడ ఫ్రెష్‌గా దొరుకుతుంటై." ఇటు చెప్పేసి అటు తన గుమాస్తను పిలిచాడు.

"నువ్విక్కడే ఉండు. కూరగాయలేవీ బయటికి పోవద్దు జాగ్రత్త!" గంభీరంగా హెచ్చరించాడు. సూపర్‌హీరోలా హీరో హోండా మీద మాయమయాడు. అప్పటి దాకా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్లేలా హుషారుగున్న బాలయ్య సర్వం పోగొట్టుకొన్న సన్యాసి లాగయ్యాడు.

"చెమటోడ్చి పండించిన నా పంటమీద నాకే హక్కులేదు వెంకటీ! బోర్ వేయిస్తి. ఎప్పుడొస్తుందో, ఎప్పుడో పోతుందోతెల్వని కరెంటు కోసం నిద్రాహారాలు మానుకుంటి...." కని పెంచిన తల్లి పిల్లల్ని పరాయిల కమ్ముకుంటున్న బాధ బాలయ్య గొంతులో సుడులు తిరిగింది.

"మరి.... నీకెట్టా? ముందే తీసుకుంటే బాగుండేది... గదా బాలయ్యా!"

"అట్టంటే అతడొప్పుకోడు. అనుమానపడ్తడు..." పోలీసు దెబ్బలు భరించలేక చెయ్యని నేరం ఒప్పుకున్నట్లుచూపులునేలకు వాలినై.

మిరపమిలమిలలు, టమాటా నిగనిగలు పగలబడి నవ్వుతున్నై. నీరసం ఇంటిదారి పట్టించింది వెంకటయ్యను.

గడపదాటుతూంటే మానస ఎదురొచ్చింది.

"నాన్నా! మన బాయిల నీళ్ళులేవు. పక్కింటోల్ల బోరు ఇయ్యాల్ల ఫెయిలైందట. ఎట్టా?" కళ్ళు ప్రశ్నార్థకాలైనాయి.

వెంకటయ్య చదువుకునేరోజుల్లో బావులనిండా నీరు, పచ్చని పొలాలతోఊరు ఆకుపచ్చ పీతాంబరం కట్టుకన్న అందాల భామలాగుండేది. తెల్లవారక ముందే మోటపాటల్లో రామాయణ, భారతాలు మేలుకొలుపు పాడేవి. సెలవుల్లో... చెరువులో తనివిదీరా ఈదులాడేవారు. మధ్యాహ్నమంతా మామిడి తోటలో కోతికొమ్మచ్చితో గడిచేది. మరిప్పుడో... చెరువులో తేమ గూడా లేదు. భూగర్భ జలాలు అడుగంటినా పంచాయితి మంచినీటి పథకం బోరు బావిమీదే ఆధారపడుతుంది. పంచాయతీ ఆఫీసు ముందు కాళ్లాగిపోయినై.

"నమస్తే బాబాయ్! పలికాడు!" యువపర్వంచి స్వాగతం ప్రాణం లేచొచ్చింది. కనురెప్పలు పైకి లేచినై

"ఏమిరా బాబూ! బాగునావా?...." కాస్సేపు క్షేమ సమాచారం తర్వాత తనొచ్చిన పని చెప్పేశాడు.

"చాలా సంతోషం బాబాయ్!" సర్పంచు మాటల్లో తియ్యదనముంది. గుమస్తాను పిలిచి "ఫీజు వగైరాలన్నీ తీసుకుని మా బాబాయికి వెంటనే నల్లా కనెక్షనివ్వాలి" ఆదేశించాడు. అటెండరు చాయలందించాడు.

"మానూర్లె హైస్కూలుంది గాని ఒక్కటీచరు గూడా కన్పించడం లేదురా బాబూ!" చాయ చప్పరిస్తూ ప్రస్తావించాడు.

"కాలం స్పీడైంది బాబాయ్!" మందహాసం. "జన్మభూమి స్కీముల ఊర్లెకు రొడ్డొచ్చింది. ముందు రోజూ పదిట్రిప్పులు ఆర్టీసీ బస్సులొచ్చేవి. ఆటోల హంగామాకు తట్టుకోలేక అవిప్పుడు రెండు ట్రిప్పులైపోయినై. మీలాంటి పెద్దల దయవల్ల అంతా బాగుంది. బాబాయ్!!" నవ్వేశాడు. పక్క మైదానములో క్రికెట్ ఆడుకుంటున్న పిల్లలు వెలుతురు పూవుల్లా కన్పించారు. ఈరోజుల్ల చిర్రాగోనె, కోతికొమ్మచ్చి ఆడుకునే పిల్లలే లేరు. అయోమయం మాయమైంది.

మర్నాడే నల్లా కనెక్షనొచ్చింది. నీళ్ళు మాత్రం మూడ్రోజుల కోసారన్నారు. సరే.... ఊళ్లో నలుగురితో నారాయణా!"

ఉదయసూర్యుని నునులేత కిరణాలు తూరుపు అకాశానికి బంగారు పూతలు పూస్తున్నాయి. సంక్రాంతి సామాగ్రి కోసం సిద్ధిపేట కెళ్ళాలని బస్టాండుకొచ్చాడు. తెలిసిన ఆడవాళ్లెందరో ఉన్నారక్కడ. పెద్ద పెద్ద గంపల నిండా కాయగూరలు, పచ్చిమిరపకాయలు నవనవలాడ్తున్నాయి.

"రామవ్వా! గివన్నీ ఎక్కడికి తీస్కపోతున్నరు?" అడిగాడు, వెంకటయ్య.

"ఇవా!" చలిపులి దాడికి తట్టుకోలేక రామవ్వ భుజాల నిండా కొంగులాక్కుంది. "సిద్దిపేట మార్కెట్ల అమ్ముతమన్నా!"

బోరుబావులు సరిగా ఉన్నవాళ్లు పండించినవేమో!

"గింత చలిల గంత దూరమెందుకు? ఈ ఊర్లెనే అమ్మరాదా?"

"గిన్ని కూరగాయలు ఇక్కడెవలు కొంటరన్నా? తోటలు గుత్తకువట్టుకున్నోళ్ళు లారీల్ల తీస్కపోతరు. మిగిలిన వాటిని మేము దీస్కపోతాము. పట్నంలైతే ఎన్ని గంపలున్నా గుత్తేదార్లు ఒక్క గంటల అమ్మిపెడ్తరు. కమీషన్ దార్లు చూస్కుంటరంతా. నగదు పైసలు చేతికొస్తయి. వచ్చేటప్పుడు పండగ సామాగ్రి కొనుక్కొని దొర్సానోలె రావచ్చు...."

నల్లని దుమ్మురేపుకుంటూ ఎర్ర బస్సొచ్చింది. సూర్యకిరణాలు పూసుకుంటున్న బస్సు మొహం మరీ ఎర్రబారింది.

సిద్ధిపేట సిటీలాగైంది. బస్సు దిగగానే హోటల్ స్వాగత్ స్వాగతం పలికి కమ్మని టిఫిన్ తినిపించింది. పాతస్నేహితుల్ని కల్సుకుని మాట్లాడ్తుంటే మనో విహంగము ఆనందా కాశములో విహరించింది. కూరగాయలతో సహా పండగ సామాగ్రి కొనేసరికి మధ్యాహ్నమైంది. రోడ్ల మీద వాహనాల రొద మైకుల మోతతో పోటీ పడుతోంది.

కాలేజి ఆటస్థలము నీటిలో నానబెట్టిన కొత్తకాటన్ గుడ్డలా కుంచించుకుపోయింది. చుట్టురా బహుళ అంతస్తుల అపార్టుమెంట్సు, ఆధునిక భవనాలు అలుముకున్నై. పట్టణం ఎల్లలు బాగా విస్తరించినై. ఆనాడు ఊరికి దూరంగా ఉన్న డిగ్రీ కాలేజి ఇప్పుడు ఊరుమధ్య కొచ్చినట్టుంది. పక్కన పి.జీ సెంటర్. ఆశ్చర్యానందాలు ఆటో ఎక్కించి బస్టాండులో దింపేశాయి.

"బస్సు లేదు గదా... ఆటోల పోదామా ఎంకటనా" గంప పక్కన కూర్చున్న రానువ్వ లేచి నుంచుంది. కొంగునడుముకు బిగించి వీరనారిగా కనబడింది.

బస్సు కోసం సాయంత్రం దాకా ఉంటే హోటల్ తిండి, మ్యాట్నీ సినిమా... దుబారా ఖర్చులు... "సరే.... పదా!"

మూడు చక్రాల ఆటో ముచ్చెమటలు పోయించింది. అందులో పదిమంది ప్రాణాలు పీచుపీచుమంటున్నై. పెద్ద బతుకమ్మలా కదిలింది. ఏ క్షణాన ఏమైతుందో! అంతా దైవాధీనం.

"ఇంగ మానూర్లెనే ఉంటవా ఎంకటన్నా?" ఆటోలో తన పక్కన గువ్వలా ఒదిగి కూచున్న రామవ్వ బుగ్గమీద వేలేసుకుంది. అవునని తలూపి "మానూర్లె పంటల్ని టోకున పట్నంల అమ్మేసి మనమే వాటిని చిల్లరగా కొంటున్నం. విచిత్రంగదూ!" అంతర్మథనాన్ని బయట పెట్టాడు.

"కాల మన్నా, పల్లె బతుకు లిట్టైపోయినై. మనూర్లె కలర్ టీవి లున్నై.. రాత్రింబవళ్లు చూడొచ్చు. పాలపాకెట్లు, నీళ్ల బాటిల్స్, కూల్‌డ్రింక్స్ దొరుకుతున్నై. పాల పాకెట్ పదిరూపాయలైతే నీళ్లబాటిల్ పన్నెండాయె. సదూకున్న పోరలకు నౌకర్లు లేవు. లుంగీ మీద ఊరుదిరిగి పత్తాలాడు కుంటున్నరు గానీ గీ కూరగాయలు ఊర్లెకొని సిద్ధిపేట్ల అమ్ముక రమ్మంటే సిగ్గుపడ్తున్నరు. గీ బేకార్‌తనం బాగుండదని మందలిస్తే అన్నలల్ల కలిసిపోతున్నరు. మాయదారి కలికాల మొచ్చిందన్నా!"

సంక్రాంతి పండగ చల్లగా వచ్చి చప్పగా పోయింది. ముందట్లాగా కబడ్డీ, ఖోఖో ఆటలు, భజనల్లేవు. పేకాట బాగా పుంజుకుంది.

సంక్రాంతిని సాగనంపి ఎండ ఎగబడింది. నల్లానీళ్లు వారానికోసారి వస్తున్నై. మానస పెళ్లి చూపుల కోసం ఇప్పుడొస్తాము, అప్పుడొస్తాము అన్న కరీంనగర్ పెళ్లికొడుక్కు మరో అమ్మాయితో పెళ్ళైపోయింటటా. ఆ సంగతి హైద్రాబాదులో ఉన్న కొడుకు జనార్ధన్ కెలా తెలిసిందో గాని ఉత్తరం రాశాడు. అదే ఉత్తరంలో

"మా ఫ్రెండు తమ్ముడు బాలేశం ఇంజినీరు. మానసనోసారి చూసిండు. నచ్చిందన్నడిప్పుడు. మీరంతా హైద్రబాదు కొస్తే పెళ్లి చూపులైతై. అందరూ సరేనంటే ముహూర్తాలు పెట్టుకోవడచ్చు....' రాశాడు మండుతున్న వెన్ను పూసకు వెన్నపూస రాసినట్లైంది. ఉత్తరం చదివి మానస

"ఆ ఇంజనీరు బాగున్నడు నాన్నా! పెద్ద జీతం కూడా" అని సిగ్గుపడింది. కూతురు అంతరంగం అర్ధమైంది. ఆలస్యం అమృతం విషం అంతా కలిసి హైద్రాబాదెల్లడం,

పెళ్ళి చూపులు, ముహుర్తాల నిర్ణయం చకచకా జరిగి పోయినై' కాని పెళ్ళి ఎక్కడ జరగాలన్నదే చర్చల్లో చిక్కుకు పోయింది.

సొంతూళ్ళో ఇంటి ముందు చెయ్యాలని వెంకటయ్య ఆరాటం, హైద్రాబాదులోనే చెయ్యాలని అబ్బాయి వాళ్లపోరాటం. చర్చల్లో ఎవరూ దిగిరాలేదు. "సరే... ఆలోచిద్దాం" నిర్ణయం ఏకగ్రీవమైంది.

ఇంటినిండా గాంభీర్యం అటుముకుంది. రాత్రి భోజనాలప్పుడు మనసుల్లోని మారాము నిశ్శబ్దాన్ని ఛేదించింది.

"నాన్నా! పెళ్లి హైదరాబాదులనే ఫంక్షన్ హాల్లో చేస్తేనే బాగుంటుంది!!" జనార్థన్ ప్రస్తావన. "అందరికీ సౌకర్యంగూడా"

"అవును మావయ్యా" అన్నం వడ్డిస్తూ "మీరు పల్లెటూరికెళ్ళగానే కరీంనగర్ సంబంధం తప్పిపాయె." అందుకుంది కోడలు. ఎండాకాలం. సీతారంపల్లిలో నీటి సమస్య ఉందన్నారు. గదా!" చేతనైనంత సముదాయించింది.

మంచి సంబంధం దొరికిందనే మురిపెంతో ఊరు చేరుకున్నారు. తెలుగు లోగిళ్ల వెలుగు... ఉగాది రానే వచ్చింది. సిద్ధిపేట నుండి పండగ సామాగ్రితో పాటు పంచాంగం తెచ్చుకున్నాడు వెంకటయ్య. మధుమాసంలో పల్లెపట్టుల ప్రకృతి సౌందర్యం. గురించి పత్రికల్లో చదివిన మానసను బీడుపొలాలు, ఎండిన చెరువు, నీళ్లు రానిబోర్లు వెక్కిరించినై. పండగనాడు పచ్చడిసేవించి, భోజనాలు ముగించి పంచాంగశ్రవణం కోసం గుడి కెళ్లారు. గుడి వాతావరణం ఆ రోజే కొత్తసినిమా రిలీజైన సినిమా థియేటర్లాగుండొచ్చు అనకున్న మానసకు నిరాశే ఎదురైంది. ఊహించినవీ కనబడలేదు. పదుల సంఖ్యలో జనాల ముందు పంచాంగ శ్రవణం పూర్తయింది. యువత పేకాటలో లీనమైంది.

"ఇదేమిట్రా? జనాలంతా ఏరీ?" ఆశ్చర్యాన్ని అదిమి పెట్టుకోలేక అడిగాడు వెంకటయ్య.

"ప్చ్... కాలం మారిందిరా!" బాలయ్య పెదాలు చప్పరించాడు. పండుగ పరమార్థం గురించి చెబితే వినేవాళ్లే లేరు. పల్లెబాటలాంటి పథకాలు పటాటోపాలకే పరిమితం. తాగు, సాగునీటి వసతులుంటేనే ధాన్యలక్ష్మిని రప్పిస్తుంది. పల్లెబతుకులు హుషారుగుంటై. వానచినుకులు లేక ఊరు వల్లకాడైపాయె...! నిర్వేదపు చిరునవ్వు మెరిసింది. బాలయ్య భార్యకు పిల్లలు కళ్లల్లో మెదిలారు.

"ముగ్గురు పిల్లలున్నా... గొడ్రాలు లెక్కై పోయిందన్నా"! కంటతడిబెట్టింది!! "పిల్లల్ని బాగా చదివిస్తే పైకొస్తారనుకున్నాం గాని మనకు అందనంత ఎదుగుతారనుకోలేదు వదినా!" అన్నపూర్ణ ఒడిలో ఒదిగిపోయింది.

మానస కోరిక మీద అంతా మామిడి తోటలో కెళ్లి కూచూన్నారు. మామిడి కాయల్ని అదే పనిగా చూస్తూ మానస "అబ్బా! ఉప్పుకారం అద్దుకుని తింటే.. ఎంత బాగుంటుందో!" ఉవ్విళ్ళూరించింది. ఆత్మ బంధువు మరణవార్త విన్నట్లు తోటమాలి అట్నుంచి పరుగెత్తుకొచ్చాడు. దమ్ముదీస్తూ "మామిడికాయల జోలికి పోవద్దయ్యా. మా గుత్తేదారు మాచెడ్డోడు!!" హెచ్చరిక వడ్డించిపోయాడు. అంతా మొహాలు చూసుకున్నారు.

విదేశాల్లో ఉన్న బాలయ్య పిల్లల గురించి, హైద్రాబాదులున్న వెంకటయ్య కొడుకు కుటుంబం గురించి మనసుల విప్పి మాట్లాడుకుంటున్నారు. మానస మామిడి పిందెల్ని చూస్తూ... నేను గూడా మీలాగనే.. అనుకుని నవ్వుతూంది.

"మాకేదన్నా అయితే దిక్కెవ్వరని కడుపుల చల్లజేసినట్టైతుంది ఎంకటీ!" బాలయ్య అంతరంగ తరంగాలు!! చేసిన కష్టం పైసలల్ల కనబడ్తుంది గాని పైసల్లోని ప్రేమ కొనుక్కుంటమా? ఆత్మీయత అంగట్ల తొరుకుతందా?"

వెంకటయ్య దంపతుల గుండెలకు గుండు సూదులు గుచ్చుకున్నట్టైంది. మానస కదేమినచ్చలేదు. అంతకు ముందే వచ్చి కూచుందక్కడ.

"మానస పెండ్లి ఖాయమాయె. ఇంట్ల వరి గింజలున్నై. మిల్లుకు తీస్కపోవాలె. బియ్యం పట్టించి పెండ్లిల వాడాలె...!!" వెంకటయ్య కూతురు వైపు చూస్తూ నసిగాడు. బాలయ్యకు నవ్వొచ్చింది.

"మీదోపిచ్చిగానీ...." అన్నపూర్ణ మందహాసం "కొత్త బియ్యం అన్నం ముద్ద గడుతుంది. పెండ్లి దావతుకు పనికిరావు"

"అవడ్లు సిద్ధిపేట్ల అమ్మేసి బియ్యం తేవాలె. తప్పదు." బాలయ్య సలహా

★ ★ ★ ★

ఉరుములేని మెరుపులా జనార్ధన్ హైద్రాబాదు నుండి వచ్చేసి అన్నపూర్ణ దంపతుల్ని ఆమోమయంలో ముంచేశాడు. "అన్నయ్యొచ్చిండు" అంటూ పసినానలా ఎదురెళ్లింది మానస.

చాయచప్పరిస్తూ జనార్ధన్ "నాన్న! చెల్లె పెండ్లి హైద్రాబాదుల్నే చెయ్యాలని వాళ్లు పట్టువడ్తున్నరు. ఒప్పుకోకపోతే మనం పరేషానై పోతము. వెంటనే ఫంక్షన్‌హాలు బుక్ చెయ్యాలె!!"

"గట్లంటే ఎట్టరా!" వెంకటయ్య గుంజాటన. ఎదో ఆరాటం.

"హైద్రాబాదులనే బాగుంటది నాన్నా!" మానస కుండబద్దలుకొట్టేసింది. "మా ఫ్రెండ్స్, వాళ్ల ఫ్రెండ్స్ అందరూ వస్తారక్కడికి"

"పల్లె.... నా తల్లిరా!" వెంకటయ్యలో ఆటుపోట్లు.

"కావుచ్చు" జనార్ధన్ సీరియస్‌గా చెప్తున్నాడు. "హైద్రాబాదు నుండి ఇక్కడికి స్పెషల్‌బస్సులు... బోలెడు ఖర్చులు... అయినా అందరు రారు. బావగారి దోస్తులు పెద్దాఫీసర్లు... వాళ్లందరి వసతికి అటాచ్ బాత్రూంలుండాలె. ఇక్కడ నీటికి కరువు. సెల్‌ఫోన్లే పంజెయ్యవు. అక్కడైతే సరిగ్గా టైంకొచ్చి అక్షింతలేసి తృప్తిగా భోంచేసి పోతరు..."

"నిజమేకాని..... పుట్టిపెరిగిన ఊర్లె ఆడపిల్లలపెళ్లి చెయ్యాలనుకున్నాను బాబూ!" మనసంతా గజిబిజిగా తయారైంది.

"అబ్బా! అనుకున్నవన్నీ అక్షరాలా అమలైతే మనిషి దేవుడై పోతడు" అన్నపూర్ణ విసుక్కుంది "కాలానికి, పరిస్థితులకు ఎదురీదితే కాళ్ళూ చేతులిరిగిపోతై."

“ఇప్పటికి తెలంగాణా పల్లెలు మునుపటి రేపల్లెలుకావు నాన్నా!” మానస ముక్తాయింపు.

తల్లి ఒడిలోంచి తననెవరో బలవంతంగా లాక్కుపోతున్నట్టుంది వెంకటయ్యకు. మౌనముద్ర వహించాడు.

“అమ్మా! నాన్న మౌనమే అంగీరాకం” తల్లితో అంటున్నాడు కొడుకు. ముందు మనమంతా హైద్రాబాదు కీరోజే వెళ్లిపోదాం. అక్కడ ఫంక్షన్ హాలు బుక్ చేసుకుందాం” మానసవైపు చూపులు మళ్లించి ‘మనూ! నీ మొగుడు అసాధ్యుడే. అనుకున్నది సాధించే రకం” లేచొచ్చి నెత్తిమీదో మెట్టికాయ యివ్వ బోయాడు.

“చూడునాన్నా!” మానస బుంగ మూతి మూడు వంకర్లు తిరిగింది. ఆ తిరుగుడులో మూడురాళ్ల ముక్కుపుడక త్రివర్ణ పతాకంలా తళుక్కుమంది.

**మన తెలంగాణ జూలై నుండి సెప్టెంబర్ 2006**

